# కాదేదీ కవితకనర్హం

రాత్రి పది గంటలయింది. అంతవరకు ఏకాగ్రతతో చదివా నేమో కళ్ళు మంటలు పుట్టున్నాయి. నిద్ర కూరుకొస్తోంది. లైటు ఆర్పి పడుకొన్నాను. నిద్ర వెంటనే పట్టేసింది. ఇంతలో పెద్ద పెద్దగా కేకలు, అరుపులు-ఉలిక్కిపడి లేచాను. ఏమయిందో ఒక్కక్షణం అర్థం కాలేదు. లేచి కిటికీ వద్దకు వెళ్ళి చూశాను. వీధి కవతల చాకలి వాళ్ళ గుడిసెల ముందు దెబ్బలాట.... ....కాదు తిట్లాట జరుగుతోంది. ఆ ఆట చూసే ఓపికలేదు. వినే ఓపిక అంతకంటే లేదు. రాత్రి నిశ్శబ్దమేమో వాళ్ళు గొంతెత్తి అరచుకొనే అరుపులు ఫుల్ వాల్యూమ్‌లో వున్న రేడియోలా వినిపిస్తున్నాయి. నిద్రకూడా భయపడి పారిపోయింది. కొద్దిగా గ్రుడ్డి వెన్నెల కాస్తోంది. బయటకు వెళ్దామా అను కొన్నాను. కాని నిద్రపోతే బాగుండునని పిస్తోంది. తిరిగిపక్కమీద పడుకొన్నాను.

రాములు, వానితో వుండే రాములమ్మ ఇద్దరూ వాగ్వివాదాలు చేసు కొంటున్నారు. చెవుల్లో వేళ్ళు దూర్చుకొని పడుకొన్నా వాళ్ళ అసభ్య పదజాలం నన్ను నిలువునా కదిలించివేస్తోంది. కంపరం పుట్టించే ఆ మాటలు....మా ఎకనమిక్స్ లెక్చరర్ అంటుంటారు. లోకంలో ఇన్ని మంచి మాటలు, అందమైన శబ్దాలు ఉండగా బూతుమాటలు ఎందుకు వాడాల్సి వస్తుందని. శబ్దానికి శక్తి ఉందికదా అందుకని కాబోలు. మంచి మాటలకు మంచి ఫలితం చెడ్డమాటలకు చెడు ఫలితం. అందుకే కలుగుతుంటాయి.

అదే ఇప్పుడు రాములమ్మ సాధిస్తోంది, అపురూపమైన తిట్లన్నీ అస్త్రాలుగా ఉపయోగించుకొన్న తర్వాత మహారథు లిద్దరూ ఆర్గ్యుమెంటులోకి దిగారు.

"నా ఇష్టం. నా రాజెం. మద్దె నీదేంది పెత్తనం. నువ్వేం తాళి గట్టినోడివా?"

"తాలి గట్టాలంటే....నా దగ్గర నీ యేసాలు సాగవ్. ఈనాడు నేనంటే మొగం మొత్తిందా? ఈరిగాడు నాకంటే బాగా....

"ఈరిగాని మాట నీకెందుకంట, నేను కష్టపడతా. నాతిండి తింటా. నా ఇష్టమొచ్చినట్టుంటా. ఆ చాడిమీద సూపుకో నీ పెతాపం. నాదగ్గర పప్పులుడకవ్."

"నోరు జారకే....ఆనాడు నేను....పోతే నీకుదిక్కేలేదు ఈనాడు ఈరిగాడు దొరికాడు నీ బతుక్కి..."

"ఎదవ మాటలూ నువ్వూ. తాగి సచ్చినోడివి నోరుమూసుకు పడుకోక సంతేమిటంట"

"సంతంటావే....సంత ...నీ ఎముకలిరగాడితే"

"ఓలమ్మో సస్తినే, నీకేం పోగాల ,మొచ్చిందిరా నీ సేతులు పడిపోనూ...."

రాములమ్మ తన పంచాంగం విప్పింది. ఆ మాటలు విషసర్పాలులా బుసలు కొట్టున్నాయి. రాములుగాడు తన భారతం విప్పాడు. ఆ మాటలు అగ్నిజ్వాలలులా దహిస్తున్నాయి. ఆ గదిలో ఒక్క క్షణం వుండలే ననిపించింది. గది మారాలని ఎన్నాళ్ళుగానో ప్రయత్నం. ఇంతవరకు కలిసిరాలేదు నేనెప్పుడో ఈ వాతావరణంలో పిచ్చివాణ్ణి అవుతాను.

సగటున వారానికి ఒకసారయినా చాకలిండ్లలో మహాసంగ్రామం జరుగకపోదు. ఆ రాత్రల్లా నాకు జాగరణా తప్పదు. సుబ్బారావు తన రూమ్‌మేటుగా రమ్మంటాడు గాని వాని పాలిష్డ్ అలగాతనం నాకు నచ్చదు.

చెప్పులేసుకొని ఈసురోమనుకొంటూ సోమసుందరం గదికి బయలుదేరాను. వాడు మేల్కొన్నాడో, నిద్రపోయాడో, గదిలో ఉన్నాడో లేడో! రాములు. రాములమ్మల కేకలకు, తిట్లకు, మధ్యవర్తుల తీర్పులకు దూరంగా, సోమసుందరం గదికివెళ్ళి తలుపు తట్టాను.

దేవుడి దయవల్ల వాడింకా మేల్కొనే వున్నాడు. సైన్సు ముఖం. ఏదో రికార్డులు గిలుకుతూనే వుంటాడు.

"ఏమిలా వేంచేశావు. టీకి వెళ్దామనా?" అన్నాడు తలుపు తీసి.

"కాదురా. ఈ రాత్రికి ఇక్కడ పడుకుందామని."

"అదేం. నీ గదిలో ఎవరైనా గెస్టులొచ్చారా?"

"ఎవరూ రాలేదు. ఎదురుగా చాకళ్ళ పోరు- ఇంకనేను భరించ లేనురా. ఎక్కడైనారూమ్‌చూసిపెట్టు.ఒక్కణ్ణేఉంటాను.రూమ్‌మేటువద్దు."

"సరే రేపు చూద్దాంలే. ఆ మంచంమీద పడుకో నిద్రొస్తుంటే. నాకింకా బోలెడంత రికార్డు వర్కుంది. లైటుంటే ఫర్వాలేదా?"

"బెగ్గర్స్ ఆర్ నాట్ చూజర్స్. నీ పని నీవు చేసుకో" అని మంచంమీదవాలి కళ్ళు మూసుకొన్నాను. కళ్ళు మండుతున్నాయి కాని నిద్రపట్టదే. రాములమ్మ రాములుగాడు....వాళ్ళ మాటలు ...." ఎక్కడో గాడిద కూస్తోంది. ఈ గాడిదలు ఎక్కడబడితే అక్కడే ఎదు రవుతాయి. ఈ ఊళ్లో, స్కూల్లో చదివే రోజుల్లో నా ఫ్రెండు రాజు. గాడిద కూతలోని పరమ రహస్యం తెలిపాడు. మొదట "అల్లా" అంటుందట. ఆ తర్వాత "హైకి, నైకి. హైకి. నైకి. హైకి, నైకి" అని "హై. హై. హై" అంటుందట. ఆ రోజుల్లో నిజంగా నమ్మేవాడిని. ఇప్పటికీ గార్దభ సర్వం అలాగే రిథమిక్‌గా వినిపిస్తుంది.

తిరిగి రాములమ్మ మనసులో మెదిలింది. నా మనసుకూడా పిచ్చిది. లోకంలోని అన్ని విషయాలూ దానికే కావాలి. ఆర్నెల్ల యింది. నేనా రూంలో చేరి. చేరిన రెండోరోజే రాములు భార్య చౌడమ్మ వచ్చింది బట్టలుతుకుతానంటూ, మూడో రోజు రాములమ్మ వచ్చింది. "నేను చక్కంగా ఉతుకుతాను. ఆ చౌడమ్మకంటే రెండ్రూపాయలు తక్కువకే ఉతుకుతాను. తెల్లంగా మెరిసిపోవాల. నా సామిరంగా ఉతికి గెంజి పెట్టానంటె పాతబట్టలు కొత్తవి కావూ." అంది.

"నాపని నచ్చకపోతే రాగి దమ్మిడీవద్దు. పన్జూసి దుడ్డివ్వండి." అంది చొరవగా రెండు షర్టులు, పైజమాలు పట్టుకొని పోయింది ఉత క్కొస్తానంటూ. ఆ మరుసటి రోజు చౌడమ్మ వచ్చి పెద్ద హంగామా చేసిపోయింది. రాములమ్మను నానాతిట్లు తిట్టింది. నాకు ఒళ్ళుమండి నా గదినుంచి బయటకు వెళ్ళమన్నాను.

పది నిమిషాల్లో చాకలిగుడిసెల్లో కురుక్షేత్రం. రాములమ్మ, చౌడమ్మ నీవెంత అంటే. నీవెంత అనుకొంటున్నారు. వాగ్వివాదాలు

చేసుకొన్నారు. జుట్టూ జుట్టూ పట్టుకొన్నారు నేను రూముకు తాళంవేసి మెస్సుకు వెళ్ళిపోయాను.

ఆ సాయంత్రం రాములొచ్చాడు. "మీరు బట్టలు రాములమ్మ కేయండి. చౌడికి నోరెక్కువ. పని సేతకాదు" అంటూ బూతులు తిట్టాడు.

"నీకు రాములమ్మ ఏమవుతుంది?" అన్నాను.

"పిలుచుకొచ్చాను దొంగ.... తిప్ప సంద్రం తిరనాలలో నా యెంటబడింది మొగుడు లేడు.'

"మరి చౌడమ్మ?"

"దాందేందిలే. బొట్టుకట్టిన పెండ్లాం. ఎప్పుడూ నోరు చించుకొంటుంది. నాలుగు తగల్నిస్తే కుయ్యో మొర్రో అంటుంది. పైగా మూర్చరోగం-పనీ పాటూ రాదు. తిని కూర్చుంటుంది. పట్టి ఎనుము...."

"రాములమ్మ ఎక్కడుంటుంది."

"దానికేం కట్టపడుతుంది. నాలుగిండ్లలో తిండి దొరుకుతుంది. ఎగవన గుడిసేసిస్తే, రెండు గాడ్డీలు కొనిస్తి ఇప్పుడు నాకు సారాయి బుడ్డి ఖర్చులిస్తుంది కమ్మగా వొండి పెట్తుంది."

మొత్తానికి రాములమ్మ పని బాగా చేస్తుంది. టైముకు బట్టలుతికి తెస్తుంది, ఏవీ పారెయ్యదు. చింపుకొనిరాదు. రోజూ గది ఊడ్చి, కూజాలో నీళ్ళుకూడా పెట్తే మరో రెండు రూపాయలిస్తానన్నాను.

"సాకలోల్లం. సాకలి పని చెప్పండి. మీకు కులం వద్దకపోయినా మాకు గావాల. నేను బెట్టిన నీల్లు మీరు తాగితే ఆ పాపం నాకు సుట్టుకొంటుంది." మొత్తానికి తనే ఇంకొక పనిమనిషిని కుదిర్చి పెట్టింది.

అప్పుడప్పుడు రాములు రాములమ్మను కూడా తంతుండేవాడు. ఆమె వచ్చినప్పుడు అడిగితే "ఏముందిలే మాలాంటోల్లకు మామూలే. కల్లుకైపులో వానికేం తెలుస్తుంది. మల్లా బుడ్డికి నేను దుడ్డిస్తేగాని దిక్కులే" అంటూ నవ్వేది.

సోమసుందరం లైటార్పితే కళ్ళు తెరచి ప్రక్కకు ఒత్తిగిల్లా. "నాకు నిద్రపట్టటం లేదురా. నేను నా గదికి వెళ్తాను" అని లేచి కూర్చున్నాను.

"నీకేం పిచ్చా? టైం ఒంటి గంటన్నర. నోరు మూసుకు పడుకో. నన్ను పడుకోనీ రేపు ప్రాక్టికల్స్. లాబ్‌లో నిలబడలేక చావాలి" అని వాడు చాపమీదే పడుకొని దుప్పటి కప్పుకొన్నాడు.

నేను ఆలోచనల్లో ఎప్పుడో నిద్రలోకి జారాను. ప్రొద్దున్నే లేచి మొహమైనా కడుక్కోకుండా నా గదికి బయలుదేరాను. మా వాడు ఇంకా నిద్రపోతున్నాడు. నా గది దగ్గరకు వచ్చేసరికి గుడిసెల దగ్గర జనం కనిపించారు. చాలమందే వున్నారు. ఏమిటోనని వెళ్లాను. ఎవరో చెప్పారు రాత్రి రాములు. రాములమ్మ బాగా తగువులాడు కొన్నారని, రాములు తాగుడు మైకంలో రాములమ్మ పొట్టలో కత్తితో పొడిచాడట రాములమ్మను ధర్మాసుపత్రిలో పెట్టారట. భగవంతుడా ప్రొద్దున్నే ఇదేంవార్త అనుకొన్నాను. ఎలాగో అలా స్నానం ముగించు కొని, మెస్సుకు వెళ్ళేముందు గవర్నమెంటు హాస్పిటలకు బయలు దేరాను. అక్కడ జనం కిటకిటలాడుతున్నారు. పోలీసులున్నారు. రాములు రేగుచెట్టు క్రింద కూర్చుని ముఖాన గుడ్డ కప్పుకొని ఏడుస్తు న్నాడు. ప్రక్కనున్నతన్ని అడిగాను ఏమయిందని, "రాములమ్మ సచ్చిపోయింది. సచ్చే ముందు పోలీసోల్లడిగితే" రాములు గాందేం తప్పు లేదు. నేను పానం తీసుకొందామని పొడుసుకున్నా. వాన్నేమీ అన కండి. నాదేముంది, ఒంటికల్లె ఇట్ల పోసింది అని చెప్పిందంట."

నేను రాములమ్మ శవాన్ని చూడలేదు. చూడ్డానికేముంది మార్చు రీకి తీసుకెళ్ళాక. కాని ఆమె మాత్రం నా కొక కథానాయికగా కని పించింది. నా కళ్ళలో నీళ్ళు తెప్పించింది. "ఒథెల్లో" డెస్డిమోనా పీక నొక్కినప్పుడు చనిపోయేముందు "ఇదంతా నేను చేసుకొందే" అని ఎమిలీతో అంటుంది.

"అబద్ధాలకోరు" అంటాడు అసూయ కాటేసిన ఒథెల్లో. ఆ నాట కంలో డెస్డిమోనా ఒక దేవత. ఆమెను శాశ్వతం చేశాడు షేక్స్ పియరు. మరి రాములమ్మ గురించి ఎవరు వ్రాస్తారు? దూరంగా ఎక్కడో గాడిద కూస్తోంది "అల్లా...."